క్లుప్తంగా

24న హనుమత్ వ్రతం



శ్రీ ఆంజనేయ స్వామి

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 24వ తేదీ ఆదివారం హనుమత్ వ్రతం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజలు చేస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు దేవస్థానం కౌంటర్ వద్ద రూ.216 చెల్లించి రసీదు తీసుకోవాలని కోరారు. వీరికి లడ్డు, పులిహోర ప్రసాదం, సింధూరం అందిస్తామన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీలో హెత్విక్ ప్రతిభ



హెత్విక్‌ను అభినందిస్తున్న కోచ్ గంట నూకరాజు, కరణంరెడ్డి నరసింహారావు

డాబాగార్డెన్స్: రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన హెత్విక్‌ను బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింహారావు, కోచ్ గంట నూకరాజు అభినందించారు. హెత్విక్ నగరంలోని ఎంవీపీ కాలనీ లిటిల్ ఏంజిల్స్ స్కూల్లో చదువుతున్నాడు. 23 కేజీల విభాగంలో ఫైట్, కాటాలో రెండు బంగారు పతకాలు, వెపన్ కాటా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం అభినందించింది. ఈ పోటీలో గెలుపొందిన హెత్విక్ 2024 జనవరిలో 3 నుంచి 6వ తేదీ వరకు న్యూఢిల్లీ తల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటున్నట్టు కోచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు వెంకట్, సీనియర్ కోచ్ ప్రేమ్, శ్రీను, సన్నీ, సతీష్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై విద్యార్థినులకు పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

తాటిచెట్లపాలెం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా సోమవారం 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని కేఎస్ఎం గరల్స్ హైస్కూల్‌లో విద్యార్థినులకు పలు పోటీలు ఏర్పాటు చేశారు. 7, 8, 9 తరగతుల పిల్లలకు ఇంధన పొదుపుపై డ్రాయింగ్, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. వీటిలో విజేతలైన ముగ్గురికి వారోత్సవాల ముగింపు రోజు 20వ తేదీన కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేస్తామని ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయ

డాబాగార్డెన్స్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో విశాఖ ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. బాక్సింగ్ కేటగిరీలో అండర్-17 విభాగంలో సభతబుషం బంగారు పతకం, అండర్-19 విభాగంలో కె.నిహారిక బంగారు పతకం, ఎస్.దేవి చిరంజీవిత వెండి పతకం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయ అభినందించారు. జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించనున్న 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం నుంచి తమ కళాశాల విద్యార్థినులు బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివలక్ష్మి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్ పద్మావతి (ఫైల్)

ఇది కదా అభివృద్ధి

శుభకార్యాలకు చింత లేదిక..

- 34వ వార్డులో కల్యాణ మండప నిర్మాణం
- రూ.49.17 లక్షలతో చకచకా పనులు
- 32, 33, 34 వార్డుల ప్రజలకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అల్లిపురం: జీవీఎంసీ పరిధిలో అత్యంత వెనుకబడిన 34వ వార్డు.. నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఈ వార్డుకు మహర్దశ పట్టింది. కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఇక్కడ చేపడుతున్నారు. వార్డు ప్రజలకు మేలు చేయాలని సంకల్పంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ల సహకారంతో ఆమె ముందుకు సాగుతున్నారు. ఈ వార్డులో ఇప్పటి వరకు సుమారు రూ.5.40 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు.

సిద్ధమవుతున్న చక్కని వేదిక..

వార్డు ప్రజలు ముఖ్యంగా శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు జరుపుకునేందుకు తగిన కల్యాణ మండపం, వేదిక లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వారి చింతను తీర్చేలా వార్డులోని కొబ్బరితోట అచ్చియ్యమ్మ పేటలోని మనోరమా థియేటర్ ఎదురుగా కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.49.17 లక్షలతో నిర్మిస్తున్న ఈ మండపానికి జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ల చేతుల మీదుగా కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఇక్కడ శిథిలావస్థకు చేరిన పాత మండపం స్థానంలో కొత్త కల్యాణ వేదిక నిర్మాణం జోరుగా జరుగుతోంది. మరో రూ.16.15 లక్షలతో ఇక్కడ గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, కల్యాణ మండపానికి చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మండపం శ్లాబు పనులు చకచకా జరుగుతున్నాయి.



కొబ్బరితోట మనోరమా థియేటర్ వద్ద నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం

ఎందరికో ప్రయోజనకరం..

కల్యాణ మండప నిర్మాణం పూర్తయితే 32, 33, 34 వార్డుల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా కొబ్బరితోట, భూపేష్ నగర్, అచ్చియ్యమ్మ పేట వాసులు వారి శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఇదో చక్కని వేదికగా నిలవనుంది.

త్వరలోనే వార్డు ప్రజలకు ఈ మండపం అందుబాటులోకి రానుంది. అభివృద్ధి పథంలో వార్డు దూసుకెళ్తుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతో వార్డు అభివృద్ధి



ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాను. వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకుల సహకారంతో పరిష్కరిస్తున్నాను. వార్డులో ఇప్పటి వరకు సుమారు రూ.5.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. త్వరలోనే వార్డు ప్రజలకు కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం

– తోట పద్మావతి, కార్పొరేటర్, జీవీఎంసీ 34వ వార్డు

ప్రజల అవసరాలు తీరుస్తున్నారు



వార్డులో కొత్తగా ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించడంతోపాటు ప్రజల అవసరాల నిమిత్తం కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. కాలువలు, యూజీడీ పనులను త్వరితగతిన చేపట్టారు. వార్డు అభివృద్ధే ధ్యేయంగా కార్పొరేటర్ పనిచేస్తున్నారు.

– గరికిన మంగ, కొబ్బరితోట

కల్యాణ మండపంతో ప్రయోజనం



34వ వార్డులో కోట్ల రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. హాస్పిటల్, కల్యాణ మండపం వంటి మేజర్ ప్రాజెక్టులు చేపట్టారు. ఈ కల్యాణ మండపం అందుబాటులోకి వస్తే వేలాది మంది ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఎం.మహేష్, కొబ్బరితోట

అందరి సహకారంతో కాలుష్య నియంత్రణ



విద్యుత్ ఆటో ద్వారా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: మహా విశాఖ నగరంలో ప్రజలందరూ ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో జీవించాలంటే ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు సహకరించాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి కోరారు. విశాఖ నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ చేపట్టిన ప్రతి సోమవారం ప్రజా రవాణాను వినియోగించాలనే కార్యక్రమాన్ని తాను, జీవీఎంసీ యంత్రాంగం క్రమం తప్పకుండా ఆచరిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌కు మేయర్ తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు విద్యుత్ ఆటోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వారానికి ఒక రోజు ప్రతి సోమవారం సైకిల్ లేదా ప్రజా రవాణా ద్వారా ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

మన లక్ష్యం.. కాలుష్య రహిత విశాఖ

కాలుష్య రహిత విశాఖే మన లక్ష్యమని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎకో–జీరో పొల్యూషన్ నేపథ్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ ప్రతి ఒక్కరూ వారంలో సోమవారం తప్పకుండా ప్రజా రవాణాను వినియోగించాలనే జీవీఎంసీ పిలుపునకు తాను సైతమంటూ కమిషనర్ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నానాటికీ పెరుగుతున్న కాలుష్యం దృష్ట్యా, నగర పర్యావరణ పరిరక్షణ దిశగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు జీవించాలనే దృఢ సంకల్పంతో జీవీఎంసీ అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సోమవారం విధులు, ఇతర కార్యకలాపాలకు హాజరయ్యే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, ప్రజలు తమ వంతు బాధ్యతగా సైకిళ్లు, ప్రజా రవాణాను వినియోగిస్తూ కాలుష్య రహిత విశాఖకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం పలువురు బాధితులకు తన సొంత నిధుల నుంచి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. 39వ వార్డు కోటవీధికి చెందిన దూడ రాజారావుకు రూ.5వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కర్రి అనసూర్యకు రూ.5వేలు, చిలకపేటకు చెందిన చిక్కం అప్పలనరసమ్మకు రూ.5వేలు, 38వ వార్డు కంచరవీధికి చెందిన మైలపిల్లి ఊర్వశికి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ తండ్రి కంబాల సింహాచలంకు, బురుజుపేటకు చెందిన యందుమూరి మంగమ్మకు, 36వ వార్డు రంగిరీజువీధికి చెందిన ఈశ్వరరావు, పలివెల్లి నీలిమ, తుమ్మడపల్లి వీధికి చెందిన బాణాల నాగమణికి రూ.5వేలు చొప్పున ఎమ్మెల్యే అందజేసి, భరోసా కల్పించారు. 33వ వార్డు బంగారమ్మమెట్టకు చెందిన వీరవల్లి ఉమామహేశ్వరరావు, గేదెల లక్ష్మణ్‌కు చెరో రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



చిలకపేటలో మురుగు నీటి సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ: చిలకపేట వద్ద మురుగు నీటి ప్రవాహ సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 39వ వార్డులో చిలకపేట ప్రజలు మురుగు కాలువ, దుర్వాసనలతో పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ఈ సమస్య ఎమ్మెల్యే వీడియో తీసి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు తెలియపరిచారు. అనంతరం కమిషనర్‌తో వాసుపల్లి మాట్లాడారు. మురుగు కాలువ ప్రవహించే కెనాల్ నుంచి చిలకపేట నివాసులను కాపాడాలన్నారు. రోజు వస్తున్న ఇంటికి ముందునే ఉంటున్న మురుగు కాలువ నీరు, దుర్వాసనతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కనీసం అడుగు బయటపెట్టలేని పరిస్థితిలో ఉన్నారని, మురుగు వల్ల వ్యాధులు సంభవించే పరిస్థితి ఉందని సమస్యను వివరించారు. పారిశుధ్య కార్మికులు రోజూ చెత్త తొలగించిన కాలువ నుంచి మురుగు వీధిలోకి వస్తూనే ఉందని తెలిపారు. ఈ విషయంపై శాశ్వత చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వాసుపల్లి కమిషనర్‌ను కోరారు. క్యాక్రమంలో ఎస్‌కేఎంఎల్ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొల్లి సింహాచలం, సనపల రవీంద్ర భరత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి



జెండాచెట్టువీధిలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



అస్పాంగార్డెన్స్‌లో కల్యాణమూర్తులు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

అల్లిపురం: సుబ్రహ్మణ్య షష్టిని దక్షిణ నియోజకవర్గంలో సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. జెండా చెట్టు వీధిలో వెలసిన శివనాగ ప్రతిష్ట పూర్వక శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో విశేష పూజా కార్యక్రమాలు, సహస్ర నామాభిషేకాలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పచ్చిగోళ్ల రాము దంపతులు, పూజారి శ్రీనివాసరావు, లింగం శ్రీనివాసరావు, కదిరి గురుమూర్తి, అల్లిపిల్లి వాసు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

అల్లిపురం: అస్పాంగార్డెన్స్‌లో శ్రీశివరామకృష్ణ దేవస్థానం ప్రాంగణంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శైవాగమ సంప్రదాయంలో మంగళధ్వని, వేద మంత్రాలతో ఆలయ అర్చకుడు బులుసు సాయికృష్ణశర్మ బృందం కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో 30 మంది దంపతులు పాల్గొని తరించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ చేసిన వ్యాఖ్యానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దేవస్థానం ఈవో జీవీ రమాబాయ్.. స్వామివారి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు సుకుమార్, రాము, ధనలక్ష్మి, అంజలి, అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది మన్మథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కెట్‌కు క్రిస్మస్ కళ



పూర్ణా మార్కెట్‌లో విక్రయిస్తున్న క్రిస్మస్ స్టార్లు



శాంతాక్లాజ్, క్రిస్మస్ ట్రీస్, డెకరేషన్ సామగ్రి

జగదాంబ: పూర్ణా మార్కెట్ క్రిస్మస్ కళను సంతరించుకుంది. ఈ నెల 25న జరిగే క్రిస్మస్ వేడుకల కోసం మార్కెట్‌లోని దుకాణాలన్నీ రకరకాల స్టార్లు, ట్రీస్‌లో కళకళాడుతున్నాయి. శాంతాక్లాజ్ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. పండగకు వారం రోజులు మాత్రమే ఉండడంతో ఇప్పటి నుంచే అమ్మకాలు జోరందుకున్నాయి. జనవరిలో వరస పండగలు, ముందుగా వచ్చే క్రిస్మస్ నేపథ్యంలో మార్కెట్ కిక్కిరిసిపోతోంది. వస్త్ర దుకాణాలు జనంతో సందడిగా మారాయి. మరోవైపు వన్‌టౌన్‌లోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతున్నాయి.

ఏసు మార్గం అనుసరణీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ: ఏసుక్రీస్తు ప్రపంచానికి చూపిన శాంతి మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లోని పెనియేల్ గాస్పల్ బాప్టిస్టు చర్చిలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. క్రైస్తవులకు గౌరవ వేతనాలు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరి సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజలు చేశారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవ..

మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎ ఎస్0806081 పేరిట చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, వాట్సాప్ నంబర్ 89855 15989కు పంపవచ్చు.



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

జగన్నాథస్వామి ఆలయంలో అన్నసమారాధన

టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మహారాణిపేట: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ యాక్షన్ కమిటీ ఆఫ్ స్టూడెంట్స్ అండ్ యూత్ అసోసియేషన్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ విడుదల చేయాలని, గ్రూప్ 1 పరీక్షలకు కొత్త సిలబస్ ప్రవేశపెట్టాలని స్పందనలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఉల్లం నాగరాజు(ఏఐఎస్ఎఫ్), వై.రాంబాబు(ఏఐవైఎఫ్), లక్కరాజు రామారావు(యూత్ కాంగ్రెస్), రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ నాయకుల నిరసన

మహారాణిపేట: పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జీవీఎంసీ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. బీసీ సమాజానికి బీజేపీ అండగా ఉంటుందని, బీసీ కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లి శ్రీనివాసుల నాయుడు, కంటుభుక్త శ్రీనివాస్, వల్లిరెడ్డి శ్రీనివాసరావు, రొంగలి గోపి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఉపాధి కల్పించండి

తాటిచెట్లపాలెం: ఉచితాలు వద్దు.. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైల్వేస్టేషన్ వద్ద ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో లబ్ధి పొందేందుకు ప్రజలకు మోసపూరిత హామీలిస్తున్న రాజకీయ పార్టీలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ తరహాలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, ఆడపిల్లలకు నగదు ఇస్తామంటూ హామీలను వచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు.

